

జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెరగాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-కడప అర్బన్

పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన కలిగి ఉండాలని ఎంఇఒ గంగిరెడ్డి సూచించారు. బుధవారం కడప నగరంలోని సిఎస్ఐ ఉన్నత పాఠశాలలో 78వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో క్విజ్ పోటీలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు అన్ని యాజమాన్యాలోల్లో 8, 9, 10వ తరగతులు చదువుతున్న విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించామని పేర్కొన్నారు. మొదటి మూడు స్థానాల్లోని నిలిచిన వారిని త్వరలో డివిజన్ స్థాయి పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులకు సమాచారం ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాగర్ దామోదర్, సురేష్, మండల వనరుల కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటి విద్యార్థి ఆత్మహత్య

- ఇడుపులపాయలో విషాదఛాయలు
- తల్లిదండ్రులు కన్నీరుమున్నీరు
- ఘటనపై ఆరా తీసిన డిఎస్‌పి



జమీషా ఖురేషి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి-వేంపల్లె

ఒంగోలు ట్రిపుల్‌ఐటికి చెందిన విద్యార్థి జమీషా ఖురేషి(17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకొన్న సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. ఇడుపులపాయ, ఒంగోలు ట్రిపుల్‌ఐటిల్లో విషాదఛాయలు అలు ముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన సయ్యద్ మగ్బుల్ కుమార్తె జమీషా ఖురేషికి ఒంగోలు ట్రిపుల్ ఐటిలో సీటు రావడంతో ఇంటర్ సెకండ్ ఇయర్ (పి-2)చదువుతున్నది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి ప్రాంగణంలో ఉన్న ఒంగోలు ట్రిపుల్‌ఐటి క్యాంపస్ చదువుతున్న జమీషా ఖురేషి మంగళవారం రాత్రి 9 గంటలకు బ్రాత్ రూంలో తన చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొని మక్కిబుతి చెందినట్లు ట్రిపుల్‌ఐటి అధికారులు తెలిపారు. స్థానిక విద్యార్థుల సమాచారతో ట్రిపుల్‌ఐటి అధికారులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విద్యార్థి మృతదేహాన్ని అర్థరాత్రి వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మంగళవారం మధ్యాహ్నం ఫైనల్ ఇయర్‌కు చెందిన ఓ విద్యార్థిని మొబైల్ ఫోన్ క్యాంటీన్ వద్ద పోయింది. ఆ మొబైల్ ఫోన్‌ను మృతి చెందిన విద్యార్థి జమీషాఖురేషి తీసుకున్న విషయాన్ని గుర్తించిన ట్రిపుల్‌ఐటి అధికారులు విద్యార్థిని మందలించడంతో పాటు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారితో విద్యార్థినితో మాట్లాడించినట్లు తెలిసింది. జమీషాఖురేషి మనస్థాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్లు ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. స్టడీ అవర్‌లో విద్యార్థిని కనపడక పోవడంతో ఆమె కోసం సిబ్బంది, సహ విద్యార్థులు వెతికారు. రాత్రి 11 గంటలకు బ్రాత్ రూంలో చున్నీతో ఉరి వేసుకొన్న సంఘటన చూసి ఇడుపులపాయలోని ఆసుపత్రికి తరలించి అక్కడ నుంచి వేంపల్లె ఆస్పత్రికి తరలించారు. విషయం కనుగొన్న సమయానికి విద్యార్థిని మృతి చెందినట్లు సిబ్బంది చెప్పారు. విద్యార్థిని మృతి చెందిన విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంతో వారు ఇడుపులపాయకు బయలుదేరి వచ్చారు. ఈ ఘటనపై ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ పోలీసులు మృతి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయాన్ని తెలుసుకొన్న పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ వేంపల్లె ఆసుపత్రి వద్దకు వచ్చి విద్యార్థిని మృతదేహాన్ని పరిశీలించడంతో పాటు విద్యార్థిని తల్లిదండ్రులు మగ్బుల్, నసీమాలతో మాట్లాడారు. ట్రిపుల్‌ఐటి అధికారులతో, విద్యార్థులతో మాట్లాడి ఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెండు రోజుల్లో ట్రిపుల్‌ఐటి వద్దకు వస్తామని చెప్పమని అంతలోనే తమ బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తల్లిదండ్రులు మగ్బుల్, నసీమాలకు ఒక కుమారుడు, కుమార్తె ఉండగా కుమారుడు బిటెక్ చేస్తుండగా, కుమార్తె ట్రిపుల్‌ఐటిలో చదువుతున్నది. చీరాల మండలంలో ఉన్న ఐటిసి కంపెనీలో మృతురాలి తండ్రి మగ్బుల్ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. కార్మికుడిగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను చదివించుకొంటున్నట్లు వారు చెప్పారు. ట్రిపుల్‌ఐటిలో మంచి చదువులు చదువుకొని ఉన్నత స్థాయికి ఎదుగుతుందని ఎంతో ఆశతో ఉన్నామని మధ్యలో ఇలాంటి ఘోరం జరిగిందని తల్లిదండ్రులు వాపోయారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమార స్వామి గుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్‌తో పాటు ఒంగోలు ట్రిపుల్‌ఐటి అధికారులు సందర్శించారు. విద్యార్థి మృతదేహానికి పోస్టుమార్టం చేసిన అనంతరం తల్లిదండ్రులకు అప్పగించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగారావు తెలిపారు.



విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎస్ఐ రంగారావు

విద్యార్థి ఆత్మహత్య బాధాకరం : పిసిసి

విద్యార్థి జమీషాఖురేషి ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి అన్నారు. ఆసుపత్రిలో ఉన్న విద్యార్థి మృతదేహాన్ని ఆయన సందర్శించారు. విద్యార్థిని తల్లిదండ్రులతో ఘటనపై చర్చించి వారిని ఓదార్చారు.ఇడుపులపాయ డైరెక్టర్‌తో ఘటనపై అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగాగా తులసిరెడ్డి మాట్లాడుతూ ట్రిపుల్‌ఐటిలో చదివే విద్యార్థులు అందరూ యుక్త వయస్సులో ఉండే పిల్లలని అ వయస్సులో సున్నితంగా ఉంటారని చెప్పారు. కళాశాల యాజమాన్యం, ప్యాకల్టీ, తల్లిదండ్రులు చాల జాగ్రత్తతో వారితో ప్రవర్తించాలని కోరారు. ఇలాంటి దురదృష్ట సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుబ్బరాయుడు, ఉత్తన్న, సుబ్రమణ్యం, వెంకటేష్ పాల్గొన్నారు.

చేనేత అభివృద్ధికి పాటుపడాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

ప్రతి ఒక్కరూ చేనేత వస్త్రాలను ధరించి చేనేత అభివృద్ధికి పాటుపడాలని, ప్రతి ఉద్యోగి ప్రతి సోమవారం చేనేత వస్త్రాలను ధరించాలని కలెక్టర్ శివ శంకర్ లోకేటి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీటింగ్ హాల్‌లో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేనేతల ప్రభుత్వమని చేనేతలను ప్రోత్సహించి వారిని ఉన్నత స్థితికి తీసుకొని రావడమే ధ్యేయంగా ముందుకెళ్తామన్నారు. ప్రొద్దుటూరులో తయారయ్యే డూపియానా సిల్క్ వస్త్రం మాధవరంలో తయారయ్యే పట్టు చీరలకు మరింత ప్రచారం కల్పించి ప్రాధాన్యతను ఇస్తామన్నారు. తనకు చేనేత రంగ అభివృద్ధికి తగు సలహాలు సూచనలు ఇస్తే చేనేత రంగానికి చేయూతనిస్తామని చెప్పారు. చేనేతలకు ఏవేవి ప్రభుత్వ పథకాలు ఉన్నాయో వాటన్నిటిని చేనేతలకు అందిస్తామన్నారు. కడప శిల్పారామంలో ప్రతి శని, ఆదివారాలలో చేనేత వస్త్ర ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. జెసి అదితి సింగ్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జాతీయ చేనేత దినోత్సవం జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. చేనేత అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలను అందిస్తామని చెప్పారు. రోటరీ క్లబ్ డిస్టిక్ గవర్నర్ సాధు గోపాలకృష్ణ, చేనేత ఐక్యవేదిక జాతీయ కన్వీనర్ మల్లికార్జున, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ లక్ష్మీ తులసి మాట్లాడారు. అనంతరం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున 300 మందికి రూ.మూడు కోట్లు చేనేత కళాకారులకు వీవర్స్ ముద్రరుణ వితరణ మెగా చెక్కును కలెక్టర్ చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో జిల్లా చేనేత, జౌళీ శాఖ ఎడి నాగరాజరావు, ఎల్‌డిఎం జనార్ధన్‌రావు, డిసిఒ సుభాషిని, సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతి, చేనేత జౌళి శాఖ డిఒలు కృష్ణ, నారాయణమ్మ అహమ్మద్, ఎడిఒలు శేషగిరిరావు, రవి కుమార్‌రెడ్డి, వనిత, అటెండర్లు జయరాం, బాలకృష్ణ, ఆప్కో కార్యాలయ ఎఎంఒ గోపాల్, సిబ్బంది ప్రవీణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ లోతేటి శివశంకర్

క్విట్ ఇండియా నిరసనలను జయప్రదం చేయండి

- వామపక్ష కార్మిక, రైతు సంఘాల నాయకుల పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ కంపెనీల నుంచి రైతుల వ్యవసాయాన్ని కాపాడాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని ఈ నెల 9న క్విట్ ఇండియా డే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు వామపక్ష కార్మిక, రైతు సంఘాల జిల్లా కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, దస్తగిరిరెడ్డి తెలిపారు. బుధవారం ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతుల వ్యవసాయాన్ని, కార్మిక హక్కులను కాలరాస్తున్న కార్పొరేట్ కంపెనీలు దేశ సంపదను లూటీ చేస్తున్న బడా కార్పొరేట్ కంపెనీలు దేశం విడిచి వెళ్లిపోవాలంటూ కార్పొరేట్స్ క్విట్ ఇండియా నినాదంతో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు పిలుపునిచ్చిందని తెలిపారు. మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరించే విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. దేశంలో విత్తన వ్యాపారం అంతా మోన్ శాంటో, కార్గిల్ లాంటి బహుళ జాతి కంపెనీ చేతుల్లో ఉందని తెలిపారు. రైతులను రక్షించే విత్తన చట్టం లేదన్నారు. పంటల బీమా పథకాన్ని కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టారని, వసూలు చేసిన ప్రీమియంలో 80 శాతం లాభాల పేరుతో కంపెనీలు దోచేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలపై విధించే పన్నును 30 శాతం నుంచి 20 శాతం తగ్గించారని, రైతుల వ్యవసాయ పరికరాలపై 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారని చెప్పారు. ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మోసగించడం దారుణమన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార సబ్సిడీ, ఎరువుల సబ్సిడీ, ఉపాధి హామీ నిధులు కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు లక్షల కోట్ల రూపాయలు పన్ను రాయితీలు ఇవ్వడం ఇదేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. ఇది వికసిత్ భారత్ కాదని అన్నదాతల ఆత్మహత్యలు, అప్పుల భారతదేశం అని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలపై పన్నులు భారం తగ్గించి ప్రభుత్వ ఆదాయం కోసం కార్పొరేట్ కంపెనీలపై పన్నుల భారం పెంచాలని కోరారు. 9న జరిగే నిరసన ప్రదర్శన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కార్మిక సంఘం జిల్లా నాయకులు బాదుల్లా, చంద్రారెడ్డి, మద్దిలేటి, లింగన్న, రైతు సంఘం జిల్లా నాయకులు గోపాలకృష్ణయ్య, బాలచంద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పేదలకు పంచండి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్



మాట్లాడుతున్న అన్వేష్

ప్రజాశక్తి-అట్లూరు

మండల పరిధిలోని నల్లాయపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 40లో 445 ఎకరాల ప్రభుత్వ భూమిని స్థానిక పేదలకు పంపిణీ చేపట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ డిమాండ్ చేశారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట నల్లాయపల్లె రెవెన్యూ పొలంలో కమలకూరు బిసి కాలనీ, కమలాకూరు వలసపాలెం, దేవానగర్, అట్లూరు కొండూరు గ్రామాల పేదలకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో వలసలు నివారించడానికి ప్రభుత్వం భూ పంపిణీ చేపట్టాలన్నారు కానీ గత ప్రభుత్వాలు పేదలకు భూ పంపిణీ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేయటం వల్లనే వైసిపి ప్రభుత్వాన్ని గ్రామీణ పేదలు ఇంటికి సాగనంపారన్నారు. నూతన ప్రభుత్వ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూకబ్జాలపైన శ్వేత పత్రం విడుదల చేసి వదిలేయకుండా భూ కబ్జాల వద్ద ఉన్న ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలని కోరారు. ప్రభుత్వం భూ సీలింగ్ యాక్ట్ అమలు చేయాలన్నారు. అప్పుడే ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా అరికట్టచ్చని తెలిపారు. మండల పరిధిలోని నల్లాయపల్లె కమలాకూరు, వలసపాలెం, కాటమారపల్లె, దిన్నెమీదపల్లె తదితర గ్రామాల పేదలకు పట్టాలు రెవెన్యూ యంత్రాంగం ఇచ్చిందని గుర్తుచేశారు. సంవత్సరాలు గుడుస్తున్నా సర్వే చేసి ఆ భూములను లబ్ధిదారులకు చూపించలేదన్నారు. ఇదేఅదునుగా స్థానికేతర్లు రాజకీయ పలుకుబడి కలిగిన వారు పెద్ద ఎత్తున భూములు ఆక్రమించి జామ్ల తోటలు, తదితర పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. ఆ భూములను రెవెన్యూ యంత్రాంగం వెంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగ పాస్ పుస్తకాలు, నకిలీ పట్టాలు వాటిని స్వాధీనం చేసుకోవాలన్నారు. అసైన్డ్ చట్టపకారం పేదలకు ఇచ్చిన భూములకు మాత్రమే సర్వే చేసి భూములు అప్పజెప్పాలన్నారు. కార్యక్రమంలో మండలం వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దుర్గమ్మ, రమణయ్య, నాయకులు సుభద్రమ్మ, మాధవి, పార్వతి, పాపలమ్మ, గురమ్మ, వెంకటసుబ్బయ్య, బి.గంగయ్య, రవిచంద్ర, సుమంత్ పాల్గొన్నారు. అనంతరం డిప్యూటీ తహశీల్దారు రవిశంకర్‌కు వినతి పత్రం సమర్పించారు.

'హెల్మెట్ ధరించండి..ప్రాణాలు కాపాడుకోండి'

ప్రజాశక్తి-కడప

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్.బాబా ఫక్రుద్దీన్, కలెక్టర్ శివశంకర్, ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణంలో ఉచితంగా హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదాలను నివా రించవచ్చునని చెప్పారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 1700 హెల్మెట్లు పంపిణీ చేశామన్నారు. హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరము, ఐ ఎస్ ఐ మార్క్ గల నాణ్యమైన హెల్మెట్లను వాడాలి, హెల్మెట్ ధరించడం పై అవగాహన పెంచుకోవాలి అని సూచించారు. కలెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు అందరూ హెల్మెట్‌ను ధరించి ప్రతి ఒక్కరికి ఆదర్శంగా నిలవాలన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం అభినందించ దగ్గ విషయమన్నారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారులు నిర్లక్ష్యం వహించకుండా తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించి సురక్షితంగా తమ గమ్యస్థానాలను చేరుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాల్గవ అదనపు జిల్లా జడ్జి జి.దినబాబు, ఆరవ అదనపు జిల్లా జడ్జి షేక్ ఇంతియాజ్ అహ్మద్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.ప్రవీణ్ కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి హేమ స్రవంతి, ఒకటవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె.భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, డిటిసి మీరా ప్రసాద్, కడప బార్ అధ్యక్షుడు బొగ్గుల గురప్ప నాయుడు, న్యాయవాదులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మహిళకు హెల్మెట్ అందజేస్తున్న కలెక్టర్, జడ్జి, ఎస్‌పి

బినామీ పట్టాలు రద్దు చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి-కాశినాయన : మండల పరిధిలోని అక్కెంగుండ్ల రెవెన్యూ పొలంలో హైదరాబాద్‌కు చెందిన శ్రీనివాసులురెడ్డికి చెందిన బినామీ పట్టాలు రద్దుచేసి అనుభవంలో ఉన్న పేదలకు న్యాయం చేయాలని సిపిఎం మండల కన్వీనర్ పోలయ్య బుధవారం తహశీల్దార్‌కు విన్నవించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2017వ సంవత్సరంలో సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పట్టాలు రద్దుచేసి పేదలకు పంచాలనిపెద్ద ఎత్తున ఆందోళన చేశామన్నారు. అప్పటి ఆర్‌డిఒ, ఆరుగురు తహశీల్దార్లను ఆరుటీములుగా విభజించి పూర్తిస్థాయిలో సర్వే చేపట్టారని, ఆ విచారణలో శ్రీనివాసరెడ్డి పట్టాలు అన్నీ కూడా బినామీ పట్టాలని వెల్లడైందన్నారు. సర్వే నెంబర్ 130, 133, 144, 145, 146, 151 ఇంకా అనేక నెంబర్లలో శ్రీనివాసరెడ్డి బినామీ పట్టాలు కలిగి 250 ఎకరాలు భూమి తన స్వాధీనంలో పెట్టుకున్నారన్నారు. ఈ భూములలో సావిశెట్టిపల్లె, వరికుంట్ల, ఆకుల నారాయణపల్లె, నాయనపల్లె, గంగనపల్లె, ఇటుకలపాడు, అమగంపల్లె అనేక గ్రామాల ప్రజలు అక్కడ సాగులో ఉన్నారన్నారు. విచారణ చేసి పట్టాలు రద్దుచేసి పేదలకు మంజూరు చేయాలని కోరారు.

ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి -గోపవరం : కాలువపల్లె పంచాయతీలో నెలకొని ఉన్న భూ సమస్యలు, ఆన్‌లైన్ ముటేషన్ భౌతిక మార్పులు వంటి సమస్యలను పరిష్కరించి రైతులను ఆదుకోవాలని సర్పంచ్ పి.శ్రీనివాసులు తహశీల్దార్ ఉదయ భారతిను కోరారు. శ్మశాం, ఈద్గా స్థలం కొలతలు వేసి వారికి కేటాయించాలని కోరారు. సమస్యలపై సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ సర్వేయర్, విఆర్‌ఒను పంపించి అన్ని కరెక్ట్‌గా ఉన్న భూ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మాబుబాష, టిడిపి నాయకులు రమణయ్య, శేషారెడ్డి పాల్గొన్నారు.

పెన్నానదిలో పెరుగుతున్న నీటి ప్రవాహం

ప్రజాశక్తి-చెన్నూరు : మండల వ్యాప్తంగా మంగళవారం రాత్రి 10 గంటల నుంచి బుధవారం తెల్లవారుజామున ఐదు గంటల వరకు మోస్తారు భారీ వర్షం కురిసింది. 29.8. మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. రాత్రంతా వర్షం కురవడంతో మండల వ్యాప్తంగా ఖరీఫ్ సాగులో రైతులు సాగుచేసిన మినుము ఇతర పంటలకు వర్షం మేలు చేకూర్చింది. వర్షం కారణంగా చెన్నూరులోని భవానీ నగర్, కడప-కర్నూల్ జాతీయ రహదారిలోని కొత్త రోడ్డు వద్ద రోడ్లలో వర్షపు నీరు నిలిచిపోయింది. దీని కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చెన్నూరు వద్ద పెన్నా నది ఉధృతి పెరిగింది. శ్రీశైలం నుంచి నీరు విడుదల చేయడంతో ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట వద్ద పెన్నా నదిలో చేరడంతో అక్కడ నుంచి చెన్నూరు మీదుగా దిగవనున్న సోమశిల జలాశయంలోకి నీరు పరుగులు పెడుతుంది. ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట వద్ద పెన్నానదిలో 9,400 క్యూసెక్కులు వరద నీరు ప్రవహిస్తుండగా కడప కెసికెనాల్‌కు. చెన్నూరు, బుడ్డాయిపల్లి, ముళ్లపల్లి కెసి ఉపకాలవలకు 150 క్యూసెక్కుల నీరు కెనాల్ అధికారులు వదులుతున్నారు. చెన్నూరు వద్ద సెంట్రల్ వాటర్ కమిషన్ అధికారులు కొండపేట పెన్నా నది వంతెనపై నుంచి నీటి ప్రవాహాన్ని అంచనా వేస్తున్నారు. ఆదినిమాయపల్లి ఆనకట్ట వద్ద నీటి ప్రవాహాన్ని కెసి కెనాల్ అధికారుల పరిశీలిస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : 'పుత్తా'

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని పరిరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని స్థానిక కొత్తపేట గంగమ్మ తల్లి దేవస్థానం ఆవరణంలో తన తల్లి పేరిట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి నాటించి వాటిని సంరక్షిస్తే సకాలంలో వర్షాలు కురిసి పాడి, పంట పొలాలతో సుఖ సంతోషాలతో ఉండొచ్చని పేర్కొన్నారు. ఆంతకుముందు గంగమ్మ దేవస్థానం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడికి సమస్యలతో వచ్చిన ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉపాధి ఎపిఒ రామా నుజన్‌రెడ్డి, మండల కన్వీనర్ టివి.కృష్ణారెడ్డి, నాయకులు మోహన్‌బాబు, వీర కుమార్‌రెడ్డి, జనార్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

స్థానిక మండల పరిధిలోని అంగడి వీధిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (తెలుగు) అదే పాఠశాలలో పూర్వపు ప్రధానోపాధ్యాయులుగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఉప్పలూరు సుజాత క్రీడా దుస్తులను విద్యార్థులకు వితరణగా అందజేశారు. అదే పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న రాచకుంట అగ్గిరప్ప వినతి మేరకు దాదాపు రూ.పది వేలు ఖర్చుతో 25 జతల క్రీడా దుస్తులను కొనుగోలు చేసి విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి మంచి ప్రతిభ ప్రదర్శించాలని పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు బత్తుల చంద్రశేఖర్, సుదర్శన్ బాబు, ఉపేంద్ర, సుకుమారి, మాధవి నారాయణ, రోళ్ళ జగన్, శ్రీనివాసులు, సులోచన, గ్రేస్ నిర్మల పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా దుస్తులు అందజేస్తున్న దాతలు

నగరంలో పర్యటించిన కమిషనర్

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఇన్‌ఛార్జి కమిషనర్, అడిషనల్ కమిషనర్ కె.రాకేష్ చంద్రం మార్నింగ్ విజిట్‌లో భాగంగా బుధవారం రామరా జుపల్లి, వినాయక నగర్ సర్కిల్, ఆలంకాన్‌పల్లి, డిస్టిక్ కోర్ట్ ప్రాంతాలను శానిటేషన్ విభాగ అధికారులు, ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో కలిసి పరిశీలించారు. వర్షం కారణంగా కడప నగరంలో పలు ప్రాంతాల వద్ద నీరు నిలువ ఉండడం గమనించిన కమిషనర్ తక్షణమే వాటిని తొలగించు చర్యల్లో భాగంగా రామరాజుపల్లిలో ఉన్న పారిశుధ్య కార్మికులతో మాట్లా డుతూ కాలువల్లో ఉన్న ఫీల్డ్‌ను తక్షణమే తొలగించి నీరు సజావుగా పారేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినాయక నగర్ సర్కిల్ వద్ద నీటిని తొలగించాలని ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఆలంకాన్‌పల్లి వద్ద చెత్త పాయింట్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. 100 శాతం ఇంటింటి చెత్త స్వీకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెయిన్ రోడ్స్‌లో ఉన్నటువంటి చెత్త పాయింట్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని శానిటేషన్ విభాగ అధికారులకు ఆదేశించారు. డిస్టిక్ కోర్టు వద్ద వర్షపు నీరు నిలువ ఉండడం గమనించిన కమిషనర్ తక్షణమే నీటిని తొలగించాలని పేర్కొన్నారు. అక్కడికి వచ్చే వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి : డిఇఒ

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లాలోని బడి ఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని డిఇఒ అనురాధ పేర్కొన్నారు. బుధవారం కడప నగరంలోని జయనగర్ కాలనీ ఎంఇఒలు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ల ఒకరోజు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాను డ్రాప్ రహిత జిల్లాగా మార్చాల్సిన బాధ్యత తీసుకో వాలన్నారు. ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా టీచర్ ఇనార్మేషన్ సిస్టంలో తమ వివరాలను అప్డేట్ చేసుకోవాలని సూచించారు. యుడైస్‌లో లోటుపాట్లను సవరించి ఖచ్చి తమైన వివరాలును తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు దశరథరామిరెడ్డి, ఇలి యాస్‌ఖాన్, లక్ష్మీ నరసింహరాజు, కేశవరెడ్డి, విశ్వనాథరెడ్డి, రా మాంజనేయరెడ్డి, రమణమూర్తి, బ్రహ్మానందరెడ్డి పాల్గొన్నారు.

'జానమద్ది' ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారుల తోడ్పాడుతో డాక్టర జానమద్ది హనుమచ్ఛాస్త్రి ఆశయాలను నెరవేర్చే దిశగా కృషి చేస్తానని సి.పి.బ్రౌన్‌భాషా పరిశోధన కేంద్రానికి నూతనంగా సంచాలకులుగా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జి.పార్వతి అన్నారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మా సమక్షంలో ఆచార్య జి.పార్వతి సంచాలకులుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్వతి మాట్లాడుతూ పుస్తక ప్రచురణల్లో, భాషా పరిశోధనల్లో భిన్నంగా, వినూత్నంగా ప్రణాళికలు చేపట్టి సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రానికి గొప్ప పేరు ప్రఖ్యాతలు వచ్చేలా కృషి చేస్తానన్నారు. పాఠకులు, పరిశోధకులకు కావలసిన పుస్తకాలను, వసతులను పరిపూర్ణంగా ఏర్పాటు చేస్తామన్నారు. సాహితీ చరిత్రలో మరుగునపడిన ఎంతోమంది కవులను, రచయితలను వెలుగులోకి తీసుకొచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య టి.రామప్రసాదరెడ్డి, పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, యోగి వేమన విశ్వవిద్యాలయం అధ్యాపకులు ఆచార్య ఎం.ఎం.వినోదిని, ఆచార్య అనిత, ఆచార్య పార్వతి, ఆచార్య మునికుమారి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సిబ్బంది డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ఎన్.రమశ్‌రావు, జి.హరిభూషణరావు, ఆర్. వెంకటరమణ, ఎం.మౌనిక, తెలుగుశాఖ బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

రేపు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని గిరిజన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు సొరకాయల శివశంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశ మందిరంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా ప్రతినిధులు, ఆదివాసి, గిరిజన సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, యువత, ఆదివాసి, గిరిజన మేధావులు పెద్ద సంఖ్యలో పాల్గొనే జయప్రదం చేయాలని పేర్కొన్నారు.



వర్షపునీటిలో వెళుతున్న విద్యార్థులు

కాలేజీకి దారేదీ..!

కొద్దిపాటి వర్షం పడినా మోకాల్లోతు నీళ్లు - ఇబ్బందుల్లో విద్యార్థులు

ప్రజాశక్తి - చక్రాయపేట

చిన్నపాటి వర్షం పడినా చక్రాయపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలంటే దారి కనిపించదు. కాలేజీకి ఎటువెళ్లాలో తెలియక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం సాయంత్రం కొద్దిపాటి వర్షం కురిసింది. దీంతో రాయచోట-వేంపల్లి మెయిన్ రోడ్డు నుంచి కాలేజీకి, పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే మార్గమధ్యంలో మోకాల్లోతు నీళ్లు ఉంటున్నాయి. ఆయా ప్రాంతాలకు వెళ్లాలంటే విద్యార్థులు, ప్రజలు చాలా అసౌకర్యానికి గురవుతున్నారని ఆ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతు బాషా, ఎస్ఐ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కాలేజీకి వెళ్లే రోడ్డు మార్గం ఎత్తు చేసి నీరు నిలవకుండా చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

పంట నమోదుతో అనేక ప్రయోజనాలు

ప్రజాశక్తి - ముద్దనూరు

రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేసే పథకాలను పొందేందుకు ప్రతి రైతు తప్పనిసరిగా పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. చింతకుంట గ్రామంలో సాగుచేసిన పంటలను, పంట నమోదు కార్యక్రమాన్ని బుధవారం ఎఒ పరిశీలించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.



ఇన్‌ఛార్జి ఆర్‌డిఒకు వినతిపత్రం ఇస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

హానికరమైన కెమికల్ ఫ్యాక్టరీని తొలగించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ముద్దనూరు మండలం పెద్దదూద్యాల గ్రామంలో ఉన్న జిఎంఈసిఒ సర్వీసెస్ ఎల్ఎల్‌పి కెమికల్ ఫ్యాక్టరీతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురు అవుతున్నాయని, హానికరమైన కెమికల్ ఫ్యాక్టరీ ని ప్రభుత్వం, అధికారులు స్పందించి తొలగించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. ఆ మేరకు బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో జమ్మలమడుగు రెవెన్యూ కార్యాలయంలో ఇన్‌ఛార్జి ఆర్డీవో శాంతమ్మకు వినతి పత్రం అందజేశారు. ఫ్యాక్టరీని అక్కడి నుండి తొలగించని పక్షంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పక్షాలను కలుపుకొని జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్, నాయకులు ముని, శంకర్ పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి మృతికి పలువురు సంతాపం

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల పరిధిలోని అప్పనపల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు సిద్ధం నాగార్జున యాదవ్ (52) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతి పట్ల పలువురు టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, పత్తూరు ఉప సర్పంచ్ ముత్తూరు రమణ, టిడిపి నాయకులు సారే రామానాయుడు, కొమ్మలూరు దామోదర్‌రెడ్డి నివాళులు అర్పించి సంతాపం తెలిపారు. నాగార్జున మృతి పార్టీకి తీరనిలోటని వారు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ప్రజాశక్తి - మైదుకూరు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డు లింగాలదిన్నెలో బుధవారం ప్రమాదవశాత్తూ విద్యుదాఘాతంతో ధనికెల చిన్నక్క (28) అనే వివాహిత మృతి చెందింది. గ్రామ సమీపంలోని పంట పొలంలోని విద్యుత్ మోటర్ వద్దకు వెళ్లిన చిన్నక్క ప్రమాదానికి గురైంది. బుధవారం ఉదయం గొర్రెలను మేపేందుకు వెళ్లి ఇంటికి వస్తూ నీళ్ల కోసం మోటర్ దగ్గరికి వెళ్లగా విద్యుత్ షాక్‌కు గురైంది. మీతురాలికి ఇద్దరు పిల్లలు. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.



మృతి చెందిన చిన్నక్క

క్రైం కార్నర్

ఎస్‌బిఐ ఎటిఎంలో చోరీకి యత్నం

ప్రజాశక్తి - ఖాజీపేట

స్థానిక ఎస్‌బిఐ ఎటిఎం కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున ఓ గుర్తు తెలియని వ్యక్తి చోరీకి యత్నించారు. ఎటిఎం కేంద్రంలోని నిఘా కెమెరాకు స్టిక్కర్ అతికించి, ఎటిఎం డోర్‌ను తెరిచే ప్రయత్నం చేశారు. అంతలోనే అలారం మోగడంతో స్థానికులు వచ్చేసరికి ఆ వ్యక్తి పారిపోయాడు. పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానిక పోలీస్‌లు ఘటన ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. నగదు చోరీకి గురికాలేదని గుర్తించారు. చోరీకి యత్నించిన వ్యక్తి ఉయోగించిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు విచారిస్తున్నారు. మైదుకూరు డిఎస్‌పి వెంకటేశులు ఎటిఎంను పరిశీలించారు.

దాడికి పాల్పడుతున్న ఇసుక ట్రాక్టర్ యాజమాన్యం

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



సమాచారం తెలుసుకుంటున్న పోలీసులు

జమ్మలమడుగులో అక్రమ ఇసుక రవాణా రోజురోజుకు పెట్రేగు తోంది. అక్రమంగా రవాణా చేస్తున్న వారే ఒకరిపై మరొకరు పోలీసులకు సమాచారం ఇస్తూ చివరికి దాడికి పాల్పడుతున్న సంఘటన జమ్మల మడుగులో బుధవారం చోటు చేసుకుంది. ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన గొడవ ఘటనలో ఒక వ్యక్తి మరొకరిపై గొడ్డలితో దాడి చేయడంతో తలకు తీవ్రంగా గాయమైంది. ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు పట్టణం దిగుపట్నం కాలనీ చెందిన వెంకటనారాయణ, కిరణ్ ఇద్దరు వ్యక్తులకు సంబంధించి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు జప్తు చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చింది నువ్వంటే నువ్వేనని ఇద్దరు గొడవపడి చివరికి పోలీస్‌స్టేషన్లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసు కున్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ఇంటికి వెళ్తున్న క్రమంలో వెంకటనారాయణపై కిరణ్ గొడ్డలితో తలపై దాడి చేసినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు తెలిపారు. గాయం తీవ్రం కావడంతో జమ్మలమడుగు ఆసుపత్రి నుంచి మెరుగైన వైద్యం కోసం ప్రొద్దుటూరుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. అయితే పోలీసులు మాత్రం అక్రమంగా ఇసుక తరలిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. కొత్తగా వచ్చిన డిఎస్పీ ఇసుక అక్రమ రవాణాపై, స్థానిక పోలీస్‌స్టేషన్ సిబ్బందిపై నిఘా ఉంచాలని బాహాటంగా చర్చించుకుంటున్నారు.

తెరుచుకోని రైతు సేవా కేంద్రం

సమయపాలన పాటించని సచివాలయ ఉద్యోగులతో రైతులు, ప్రజలకు తిప్పలు



రైతు సేవా కేంద్రం వద్ద వేచి ఉన్న రైతులు

ప్రజాశక్తి - ముద్దనూరు

వ్యవసాయ శాఖ సిబ్బంది గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ పథకాలను చేరువ చేసేందుకు ప్రభుత్వం ఆయా గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసింది. ఆ దిశగా సిబ్బందిని నియమించింది. అయితే సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. మండలంలోని బొందలకుంట రైతు సేవా కేంద్రం బుధవారం మధ్యాహ్నం ఒంటి గంటైనా తాళం వేసి ఉంది. బొందలకుంట గ్రామ సచివాలయ పరిధిలోని కొందరు రైతులు బుధవారం రైతు సేవా కేంద్రానికి వెళ్లారు. ఆర్‌ఎస్‌కె మూసి ఉండడంతో రైతులు పడిగాపులు కాసి, చేసేదిలేక వెనుదిరిగారు. విలేజ్ హార్టికల్చర్ అసిస్టెంట్ (విహెచ్ఎ) అందుబాటులో లేకపోవడంతో రైతులు నిరాశగా వెనుదిరిగారు. సచివాలయం ఉద్యోగులు సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు, ప్రజలు ఆరోపిస్తున్నారు. కనీసం కార్యాలయం తలుపులు కూడా తెరవడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేసి విధులకు హాజరు కాకుండా ఆయా శాఖల అధికారుల అనుమతి లేకుండా ఇష్టానుసారంగా తిరుగుతున్నారనే ఆరోపణలున్నాయి. సచివాలయ ఉద్యోగులు లీవు పెట్టకుండా, అధికారుల అనుమతి తీసుకోకుండా గ్రామాల్లో అందుబాటులో ఉండడంలేదని పలువురు పేర్కొంటున్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది గ్రామాల్లోని రైతులకు అందుబాటులో ఉండడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఉద్యోగులు సమయపాలన పాటించి రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హాజరు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం

బొందలకుంట రైతు సేవా కేంద్రం విహెచ్ఎ సెలవు పెట్టలేదు. అనుమతి కూడా తీసుకోలేదు. సచివాలయంలో రైతులకు అందుబాటులో ఉండని విహెచ్ఎలు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు. హాజరు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

- మల్లేశ్వర్‌రెడ్డి, మండల ఉద్యానశాఖ అధికారి

నేతన్నలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్



మాట్లాడుతున్న వీరనాల శివనారాయణ

ప్రభుత్వాల మారు తున్న, పాలకులు మారుతున్న చేనేతల బతుకులు మారడం లేదని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివ నారాయణ తెలిపారు. బుధవారం జాతీయ చేనేత దినోత్సవం పురస్క రించుకొని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఆధ్వర్యంలో పాత బస్టాండ్ వద్ద గాంధీజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. చేనేతల సమస్యలపైన పాలకుల ఆలోచనలు మారాలని కోరుతూ గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు కొండయ్య, వీరనాల శివకుమార్, పల్లా లక్ష్మి నారాయణ, దాసు, గొరిగే కృష్ణ, ముని, శంకర్, కృష్ణయ్య పాల్గొన్నారు. స్థానిక మూడురోడ్ల కూడలిలోని జమ్మలమడుగు తొలి శాసనసభ్యులు కుండా రామయ్య విగ్రహానికి పూలమాలవేసి చేనేతలకు, ప్రజలకు జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బడిగించల చంద్రమౌళి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన నేతన్న నేస్తం కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ భీమునిపల్లి రామయ్య, చింతలపల్లి రాఘవేంద్ర, జెవివి ప్రెసిడెంట్, సిలివేరి శ్రీను, కంభం ఓబులకొండు, కుండా శంకరయ్య, పుల్లగుర చౌడయ్య, పూజారి రాఘవేంద్ర, వులుసాల వెంకటరాముడు శిలివేరి దాసు, బడిగించల నరసింహులు, చేనేత కళాకారులు పాల్గొన్నారు.

వేంపల్లె : చేనేత రంగానికి ముందుంచేందుకు ప్రతి ఒక్కరూ అందించాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెరసాల యోగాంజనేయులు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో చేనేత దినోత్సవ వేడుకల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలు నిజమైన బంగారు పూత కలిగిన వస్త్రాల్లా కలిగి ఉంటాయన్నారు. చేనేత వర్గంపై నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ఆవరణలో చేనేత వస్తువుల ప్రదర్శన చేపట్టి, విక్రయాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి డాక్టర్ ఓబులరెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, ప్రోగ్రాం అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వహిస్తున్నా నోటీసులిచ్చారు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మార్కెట్ యార్డులో కాంట్రాక్టు ఉద్యోగులకు సంబంధించి సెక్యూరిటీ గార్డు ఎద్దుల మహేశ్వర్‌రెడ్డి, అటెండర్ కాసుల హజార్ బుధవారం మార్కెట్ యార్డు కార్యాలయంలో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించారు. అక్కడ ఉన్న సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు సంఘటనాస్థలానికి చేరుకుని అక్కడ ఉన్న ఆత్మహత్యా యత్నానికి వస్తువులను తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లారు. అక్కడ పోలీసుల వారికి కౌన్సెలింగ్ చేసి చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు పంపించారు. అనంతరం మహేశ్వర్‌రెడ్డి, హజార్ మాట్లాడుతూ తమను అకారణంగా ఉద్యోగం నుంచి తొలగించారంటూ కార్యాలయంలో పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించామని తెలిపారు. ఇటీవల ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు అధికారులు నోటీసు ఇవ్వడంతో మనస్తాపానికి గురయ్యామన్నారు. గత ప్రభుత్వంలో తమకు ఉద్యోగాలు వచ్చాయని, అయితే ఏ కారణం చెప్పకుండా నోటీసులు ఇస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ లను తమపై రుద్దడం న్యాయం కాదన్నారు. విధుల్లో ఎలాంటి తప్పు చేయ లేదన్నారు. తమ ఉద్యోగాలు ఉండేలా చూడాలని అధికారులను కోరారు.

కర్నూల్ రేంజ్ డిఐజి ప్రవీణ్‌ను కలిసిన బీటెక్ రవి

ప్రజాశక్తి - సింహాద్రిపురం



నూతన డిఐజి కోయ ప్రవీణ్‌తో బీటెక్ రవి

కర్నూల్, కడప రేంజ్ నూతన డిఐజి కోయ ప్రవీణ్‌ను పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి(బీటెక్ రవి) కలిశారు. బుధవారం కర్నూల్‌లోని డిఐజి కార్యాలయంలో కలిసి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా పులివెందుల, కడప జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో టిడిపి కార్యకర్తలపై జరిగిన వేధింపులపై వివరించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

యుసిఐఎల్‌ను సందర్శించిన వైవీయూ విద్యార్థులు

ప్రజాశక్తి - వేముల

వైవియు జియాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం యుసిఐఎల్ తుమ్మలపల్లె యూనిట్‌లోని యురేనియం ఖనిజ ప్రాసెసింగ్ సౌకర్యాలను సందర్శించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటామిక్ ఎనర్జీ 2024లో 70 ఏళ్ల పూర్తి చేసుకుంది. ప్లాటినం జూబ్లీని గ్రాండ్‌గా జరుపుకోవడానికి యుసిఐఎల్ ఫ్లాగ్‌షిప్ కింద అనేక ఈవెంట్‌లు నిర్వహిస్తున్నారు. వైవియు ప్రతినిధులకు జ్ఞాపికను అందజేశారు. యూనివర్శిటీ ప్రొఫెసర్లు విజయవంతమైన సందర్శన కోసం గొప్ప ఏర్పాట్లు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కె.నాగరాజు, ఎల్.రాజేష్, బృందం విద్యార్థులందరికీ మెమెంటో, బ్రోచర్లు అందించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ కె. రఘుబాబు, వి.సునీత, మోహన్‌రెడ్డి, ఎన్‌విరెడ్డి, టీసీఎస్‌రెడ్డి, వాసుదేవ్‌రెడ్డి, ఎల్.కోటేశ్వరరావు, భద్రదాస్, ఎన్.జయరాజు, ఎస్.శ్రీనివాస గౌడ్, ఆర్ సిద్ధిరాజు, ఎం.ప్రమోద్‌కుమార్, శశికుమార్ నాయక్, రవి పాల్గొన్నారు.

జమ్మలమడుగు డిఎస్‌పిగా హుస్సేన్ పీరా

ప్రజాశక్తి - జమ్మలమడుగురూరల్



బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్‌పి

జమ్మలమడుగు డిఎస్‌పిగా జి.హుస్సేన్ పీరా బుధవారం బాధ్యతలు స్వీక రించారు. అనంతపురం జిల్లా పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ నుంచి ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మల మడుగు డివిజన్ వ్యాప్తంగా అసాంఘిక కార్యకలాపాలపై పోలీసు నిఘా ఉంటుందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పోలీస్ సేవలు మెరుగు పరుస్తామన్నారు.

అల్లాడుపల్లెలో రేషన్ బియ్యం పంపిణీ

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - చాపాడు



రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న వీఆర్ఎ, ఎండియు

మండల పరిధిలోని అల్లాడుపల్లె గ్రామంలో బుధవారం రేషన్ బియ్యాన్ని పంపిణీ చేపట్టారు. మంగళవారం 'రేషన్ బియ్యం కోసం ఎదురుచూపులు' అనే శీర్షికతో 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పం దించిన ఆర్ఐ ప్రమీల చర్యలు చేపట్టి బియ్యం పంపిణీ ప్రారంభించారు. ఎండియు ఆపరేటర్ జెర్మియా, వీఆర్ఏ వీరభద్ర రేషన్ బియ్యం పంపిణీ చేశారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డిఎస్‌పి మురళి నాయక్

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

- డిఎస్‌పి మురళి నాయక్

ప్రజాశక్తి - వేంపల్లె

ఘర్షణలకు పాల్పడకుండా రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని పులివెందుల డిఎస్‌పి మురళి నాయక్ సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పోలీసు స్టేషన్‌లో చక్రాయపేట, వేంపల్లె మండలాల్లోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతావరణంలో నివసించాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే అలాంటి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసుల దృష్టికి తేవాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని కోరారు. సమావేశంలో వేంపల్లె సిఐ సురేష్‌రెడ్డి, ఆర్కేవ్యాలీ సిఐ గోవిందురెడ్డి, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి, ఆర్కేవ్యాలీ ఎస్ఐ రంగారావు, చక్రాయపేట ఎస్ఐ వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ప్రారంభమైన అంకాలమ్మ విగ్రహ ప్రతిష్టాపన

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపల్ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో శ్రీ అంకాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమాలు వెల్లాల సీతారామ శర్మ ఆధ్వర్యంలో ప్రారంరంభమయ్యాయి. మొదటిరోజు బుదవారం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం పెద్ద ఎత్తున చేపట్టారు. గ్రామపెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

నేడు గజ్జలపూజ : పెద్ద రంగాపురం గ్రామంలో జరుగుతున్న శ్రీఅంకాలమ్మ తల్లి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా రెండవ రోజు గురువారం రాత్రి దేవస్థానం సమీపంలో ప్రజల సహకారంతో చెక్క భజన గురువు సాంబ శివుడు ఆధ్వర్యంలో గజ్జల పూజ ఉంటుంది.

భగత్‌సింగ్ కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలం పరిధిలోని బి.కొత్తపల్లె పంచాయతీ కుమ్మరికొట్టాల గ్రామ భగత్‌సింగ్ కాలనీ వాసులు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటీవల సాగునీటి కాలువ మరమ్మతుల్లో భాగంగా తాగునీటి గొట్టాలు దెబ్బ తిన్నాయని, దీంతో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ పట్టించుకోలేదని, తగు చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణం సమస్యను పరిష్కరించాలని భగత్ సింగ్ కాలనీ ప్రజలు కోరుతున్నారు.



దెబ్బతిన్న తాగునీటి పైప్‌లైన్



కాబోయే చైర్మన్లతో టిడిపి నాయకులు

గండి, వృషభాచలేశ్వర స్వామి దేవస్థానాలకు చైర్మన్లు ఖరారు

ప్రజాశక్తి - వేంపల్లె

చక్రాయపేట, వేంపల్లె మండలాల్లోని గండి, వృషభాచలేశ్వర స్వామి దేవస్థానాలకు చైర్మన్లుగా ఇడుపులపాయకు చెందిన వెంకటస్వామి, చింతలమడుగుపల్లెకు చెందిన పివి రమణను నియమించేందుకు ఖరారు చేసినట్లు టిడిపి మండల పరిశీలకుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపి పులివెందుల ఇన్‌ఛార్జి బిటెక్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించామన్నారు. అలాగే పార్టీకి ఎనలేని సేవ చేసిన అదే గ్రామానికి చెందిన పిపి చెంద్రాయుడును తదుపరి గండి చైర్మన్‌గా ఎన్నుకునేందుకు బిటెక్ రవి హామీ ఇచ్చినట్లు చెప్పారు. ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత వీరిని ఆయా దేవస్థానాలకు చైర్మన్‌గా నియమించనున్నట్లు వివరించారు. విలేకరుల సమావేశంలో టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి, పివి రమణ, పిపి చెంద్రాయుడు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎస్ఎంసి ఎన్నికలకు సహకరించండి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలకు సహకరించాలని ఎంఇఒ ఓబులేస్ అధికారులను కోరారు. ఆ మేరకు ఆయన బుధవారం ఎంపిడిఒ సల్మాన్‌రాజ్, తహశీల్దార్ గుర్రప్ప, ఎస్ఐ అనిల్‌కుమార్ సంబంధిత పూర్తి వివరాలను అందజేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 2,120 మంది విద్యార్థులకు సంబంధించి 38 పాఠశాలల్లో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని ఆయన కోరారు.

బాధ్యతలు స్వీకరించిన తహశీల్దార్లు

ప్రజాశక్తి - చింతకొమ్మదిన్నె

నూతన తహశీల్దార్‌గా నాగేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ, ఇతర రెవెన్యూ సమస్యలు తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తానని ఆయన పేర్కొన్నారు.

చక్రాయపేట : ప్రజా సమస్యల పట్ల అలసత్వం వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని కొత్త తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పి.విజయకుమారి తెలిసారు. ఆమె బుధవారం చక్రాయపేట తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. వీరపునాయనపల్లె తహశీల్దార్‌గా పని చేస్తూ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ కె.వెంకటరెడ్డి, జూనియర్ అసిస్టెంట్ స్రవంతి, సీనియర్ సహాయకులు, ఆర్ఐ నాగన్న పాల్గొన్నారు.

వేంపల్లె : మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న భూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం వేంపల్లె రెవెన్యూ కార్యాలయంలో ఆయన తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బంది స్వాగతం పలికి సత్కరించారు. సాధారణ బదిలీల్లో విజయవాడ సెక్రటేరియట్‌లో పని చేస్తున్న హరినాథ్‌రెడ్డిని ఇక్కడికి బదిలీ చేశారు. టిడిపి జిల్లా మైనార్టీ ప్రధాన కార్యదర్శి ఫయాజ్ బాషా, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, మండల ప్రధాన కార్యదర్శి మహబూబ్ షరీఫ్, డాక్టర్ కరీముల్లా, డక్కా చంద్ర, పీరా సాహెబ్, పలువురు అధికారులు, తహశీల్దార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శివలక్ష్మి, ఆర్ఐ లోకేష్, మండల సర్వేయర్ శివారెడ్డి, శంకర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ భరత్, విఆర్ఒలు ఓబయ్య, రవి, రాఘవేంద్రరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముర్రుపాలతోనే చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి

ప్రజాశక్తి - మైదుకూరు

బిడ్డ పుట్టిన వెంటనే తల్లి ముర్రుపాలు పట్టడంతో చిన్నారులకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని మైదుకూరు పదవ వార్డు సచివాలయ మహిళా పోలీస్ కె.సునంద అన్నారు. స్థానిక వెంకటసుబ్బయ్య కాలనీలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో తల్లులకు తల్లిపాలు ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఎఎన్ఎం ఉమాదేవి, అంగన్వాడీ కార్యకర్త సుమతి పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల : జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం వినాయక నగర్ అంగన్వాడీ కేంద్రంలో ఓ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా సమతా కో-కన్వీనర్ హన్నా ఎస్తేర్ తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. అంగన్వాడీ టీచర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ పిల్లల మానసిక, శారీరక అభివృద్ధికి తల్లిపాలు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేసి, తల్లులకు పంపిణీ చేశారు. కుసుమకుమారి, లక్ష్మి, అంగన్వాడీ పరిధిలోని తల్లులు పాల్గొన్నారు.

పెద్దముడియం : మండలంలోని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పెద్దపసుపుల విలేజ్ హెల్త్ క్లినిక్‌ను డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ తనిఖీ చేశారు. తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం సందర్భంగా గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లోని రికార్డులను తనిఖీ చేసి, ఆరోగ్య సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. కాన్పు కోసం మేడిదిన్నె పిహెచ్‌సికి వచ్చే విధంగా ప్రోత్సహించాలని ఆశా కార్యకర్తలను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మహమ్మద్ హుస్సేన్, హెల్త్ సూపర్వైజర్ శాంతకుమారి, సిహెచ్ఒ లావణ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటిఐ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

జమ్మలమడుగు రూరల్ : ఐటిఐ విద్యార్థుల సమ స్యలను వెంటనే పరిష్క రించాలని టిఎన్ ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు బిజి వేముల చేతన్‌రెడ్డి కోరారు. స్థానిక రెవెన్యూ డివిజన్ ఇన్‌ఛార్జి అధికారి శాంత మ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకులు భార్గవ్, రామాంజనేయరెడ్డి, రాజేష్, మహేష్ పాల్గొన్నారు.